

కైలాస వాహనంపై విహరిస్తున్న భ్రమరాంబ, మల్లికార్జున స్వామి

కైలాస వాహనంపై శివ పార్వతులు

- సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు
- నేడు కల్యాణోత్సవం, నంది వాహన సేవ

శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామి కైలాస వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీగిరి శివ నామస్మరణతో హోరెత్తుతోంది. సంక్రాంతి సందర్భంగా జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు దూర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున వచ్చారు. దీంతో క్షేత్రం రద్దీగా కనిపిస్తోంది. వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి.

వివరాలు 8వ పేజీలో



శ్రీశైలంలో కళాకారుల ప్రదర్శన









కృష్ణానదిలో నిషేధిత అలివి వలలతో చేపల వేట యథేచ్ఛగా సాగుతోంది. కృష్ణానది బ్యాక్ వాటర్ తగ్గే కొద్ది ఫిషింగ్ మాఫియా విజృంభిస్తోంది. నాలుగైదు నెలల్లోనే చేప పిల్లలతో సహా కృష్ణా నదిలో ఉన్న మత్స్య సంపద మొత్తాన్నీ దోచుకుంటూ రూ.కోట్లు గడిస్తున్నారు. దోమ తెర కంటే సన్నటి రంధ్రాలు ఉన్న వలలు వాడటం వల్ల కృష్ణమ్మ ఒడిలోని చిన్న చేప పిల్లలు సైతం అందులో పడిపోతున్నాయి. గుడ్లను కూడా ఈ వలలతో లాగేస్తుండడంతో మత్స్య సంపద తగ్గిపోతోంది. ఇంత జరుగుతున్నా అధికారులు చేపల మాఫియాపై కన్నెత్తి చూడటం లేదు.

పగిడ్యాల మండలం నెహ్రూనగర్ వద్ద కృష్ణా నదిలో అలివి వలలతో చేపలు పడుతున్న దృశ్యం



కృష్ణా నదిలో చేపల మాఫియా

- యథేచ్ఛగా మత్స్య దోపిడీ..
- తిష్టవేసిన ఇతర రాష్ట్రాల కార్మికులు
- నదీ తీరాన, ఎత్తయిన తిప్పలపై స్థావరాలు
- రూ.కోట్లలో అక్రమ వ్యాపారం
- పట్టించుకునే నాథుడే కరువు
- నిద్రావస్థలో మత్స్యశాఖ అధికారులు.

నందికొట్కూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కృష్ణానది తీరంలో నిషేధిత అలివి వలలతో పలువురు చేపల వేట సాగిస్తున్నారు. ఇక్కడ నిత్యం రూ.లక్షల్లో మత్స్య వ్యాపారం సాగుతోంది. నందికొట్కూరు నియోజకవర్గంలోని నందికొట్కూరు, పగిడ్యాల, జూపాడుబంగ్లా, కొత్తపల్లి మండలాల్లోని శాతనకోట, మల్యాల, నెహ్రూనగర్, ముచ్చుమర్రి, పోతులపాడు, సంగమేశ్వరం, జానాల గూడెం, బలపాల తిప్ప, ఇలా పాతాళగంగ వరకు 100 కి.మీటర్లకు పైగా కృష్ణా నదిలో చేపల వేట కొనసాగుతోంది. నవంబరు నుంచి కృష్ణానదిలోని క్రమంగా నీరు తగ్గుతుంది. ఈ సమయంలో చేపలు పట్టేందుకు కొందరు అక్రమంగా అలివి వలలతో నదిలోనే మకాం వేస్తారు. శాతనకోట వద్ద, మూర్వకొండ, వీరాపురం, అర్లపాడు, సంగమేశ్వరం తదితర ప్రాంతాల్లో ఉన్న తిప్పలపై గుడారాలు వేసుకుని మరీ అలివితో చేపలవేట కొనసా గిస్తున్నారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం మత్స్యశాఖ లక్షల్లో చేపపిల్లలను సంవత్సరంలో రెండు సార్లు నెహ్రూనగర్ వద్ద కృష్ణానదిలో వదులుతారు. అధికారులు చేపపిల్లలను వదిలాక ఫిషింగ్ మాఫియా అలివి వలలతో నదిలో నుంచి తోడేస్తున్నారని, తమకు ఎలాంటి ఉపయోగం ఉండదని స్థానిక మత్స్యకారులు వాపోతున్నారు.

చిన్న పిల్లలకే డిమాండ్

సాధారణంగా కృష్ణానదిలో వదిలే చేప పిల్లల్లో బేర్షలు, బట్టగెండె, పొట్టు, మోసు రకాలు ఉంటాయి. వీటిని ఔషధాలు, కాస్మోటిక్స్‌లో ఉపయోగిస్తారు. ఒకసారి అలివి వల నదిలో వేస్తే సుమారు 10 నుంచి 15 క్వింటాళ్ల వరకు చేపలు, చేపపిల్లలు చిక్కుతాయి. ఇందులో సగం వరకు చిన్న పిల్లలే ఉంటాయి. వాటిని నది ఒడ్డున అరబెట్టి విజయవాడకు రవాణా చేశారు. ఇటు ఏపీ అటు తెలంగాణ రాష్ట్రాల అధికారులు దాడులు చేస్తేనే మత్స్యసంపద పెరిగే అవకాశం ఉంటుంది.

తెలంగాణ నుంచి కూడా..

తెలంగాణ రాష్ట్రం నాగర్‌కర్నూలు జిల్లా పెంట్లవెల్లి మండలంలో జటప్రోలు, మంచాలకట్ట, మల్లేశ్వరం, కొల్లాపూర్ మండలంలోని అమరగిరి, సోమశిల తదితర శివార్లలోని నదీ తీరంలో అలివి వలలతో వేట సాగిస్తారు. అక్కడ ఎండ బెట్టిన చిన్న చేపలను సంచుల్లో నింపి పడవల ద్వారా ఆంధ్రప్రదేశ్‌లోని నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గంలోని నదీ తీర పల్లెలకు తరలిస్తారు. ఇక్కడి నుంచి విజయవాడ, వైజాగ్ తదితర ప్రాంతాలకు మాఫియా ఎండు చేపలను తరలిస్తారు.

మిగతా 8వ పేజీలో

నమో నారసింహా...

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ వైష్ణవ క్షేత్రమైన అహోబిలం లక్ష్మీనరసింహస్వామికి సంక్రాంతి ఉత్సవాల్లో భాగంగా అర్చకులు సోమవారం విశేష పూజలు నిర్వహించారు. భోగి పండుగను పురస్కరించుకుని చిత్తం చిరు గాలే పాశురం వేడుకలను వైభవంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మ వారికి నవకలశ తిరుమంజనం నిర్వహించారు. అనంతరం ప్రహ్లాదవరదస్వామికి, గోదాదేవి అమ్మ వారికి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్య నారాయణన్ ఆధ్వర్యంలో ఈ పూ జా కార్యక్రమాలు జరిగాయి.

శ్రీవారి దర్శన వేళల్లో మార్పు: అహోబిలం లక్ష్మీనరసింహ స్వామి దర్శన సమయాల్లో మార్పులు చేసినట్లు మఠం నిర్వా హకులు, ఆలయ మేనేజర్ మురళీధరన్ సోమవారం తెలిపారు. ఆలయ 46వ పీఠాధిపతి ఆదేశాల మేరకు నారసింహుడు పా ర్వేట ఉత్సవం సందర్భంగా ఈ నెల 15వ తేదీన ఎగువ అహోబిలంలో సాయంత్రం 4 గంటల వరకు, దిగువ అహో బిలంలో సాయంత్రం 3 గంటల వరకు మాత్రమే స్వామివారి దర్శనం ఉంటుందని తెలిపారు.



శ్రీదేవి, భూదేవి సమేత ప్రహ్లాద వరదస్వామికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

నంద్యాల ఏఎస్పీగా మంద జావలి అల్ఫోన్స్

- త్వరలోనే బాధ్యతల స్వీకరణ



నంద్యాల, జనవరి 13, (ఆంధ్రజ్యోతి) : నంద్యాల ఏఎస్పీగా మంద జావలి అల్ఫోన్స్ నియామకమయ్యారు. ఇటీవల శిక్షణ పూర్తి చేసిన పలువురు ఐపీఎస్‌లకు పోస్టింగ్‌లు కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా నంద్యాల జిల్లా ఏఎస్పీగా మంద జావలి అల్ఫోన్స్‌ను నియమించారు. ఈమె 2022 బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి. అయితే నంద్యాల ఏఎస్పీగా ఆమెను నియమించినప్పటికీ ఆమె మాత్రం నంద్యాల సబ్ డివిజన్ పోలీసు అధికారిగా సేవలందించాల్సి ఉంది. ఆమె త్వరలోనే బాధ్యతలు స్వీకరించనున్నారు. ప్రస్తుతం డీఎస్పీగా పని చేస్తున్న శ్రీనివాసరెడ్డిని డీజీపీ కార్యాలయంలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వులు జారీ చేశారు.

కైలాస వాహనంపై శివ పార్వతులు



- సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు
- నేడు పార్వతీ కళ్యాణం
- స్వామి, అమ్మవార్లకు నంది వాహన సేవ

శ్రీశైలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం మహాక్షేత్రంలో మకర సంక్రాంతి బ్రహ్మోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం భ్రమరాంబ సమేత మల్లికార్జునుడు కైలాసవాహనంపై భక్తులకు దర్శనం ఇచ్చారు. లోకకల్యాణార్థం ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు జరిపారు. అనంతరం చండీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, జపాలు, రుద్ర పారాయణాలు, చతుర్వేద పారాయణాలు చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను కైలాసవాహనంపై ఆశీనులను చేసి క్షేత్ర వీధుల్లో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. ఉత్సవం ఎదుట కళాకారులు, డప్పు వాయిద్యాలు, కళాకారుల శంఖు, డమరుక నాదాలు, చెంచుల నృత్యాల సందడి భక్తులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు, ఉభయ దేవాలయాల అర్చకులు, వేదపండితులు తదితరులు పాల్గొన్నారు.









సంప్రదాయబద్ధంగా భోగి వేడుకలు

భోగి పండుగను సంస్కృతీ సంప్రదాయ పరిరక్షణలో భాగంగా సోమవారం భోగి వేడుకలను దేవస్థానం ఘనంగా నిర్వహించింది. వేకువజామున స్వామి, అమ్మవార్లకు ప్రాతఃకాల పూజలయ్యాక ప్రధాన ఆలయం మహాద్వారం ఎదుట గంగాధర మండపం వద్ద భోగి మంటల కార్యక్రమాన్ని నిర్వహించారు. పిడకలు, ఎండుగడ్డి, వంట చెరుకుని వేసి భోగి మంటలను రాజేశారు.

సామూహిక భోగి పండ్ల కార్యక్రమం

భోగి పండుగను పురస్కరించుకొని ఆలయప్రాంగణంలోని అక్కమహాదేవి అలంకార మండపంలో ఐదు సంవత్సరాలలోపు చిన్నారులపై భోగిపండ్లు పోసి అర్చకస్వాములు, వేదపండితులు ఆశీర్వదించారు. దాదాపు 100 మందికిపైగా చిన్నారులకు భోగిపండ్లు పోసినట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. శ్రీనివాసరావు పాల్గొన్నారు.



శ్రీశైల క్షేత్రంలో కైలాస వాహనంపై విహరిస్తున్న స్వామి అమ్మవారుల

నేడు శివ పార్వతుల కల్యాణం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని మంగళవారం రాత్రి స్వామి, అమ్మవార్లకు కల్యాణోత్సవం నిర్వహించనున్నారు. నందివాహనంపై ఆదిదంపతులను ఊరేగిస్తారు.

వైభవంగా వార్షిక ఆరుద్రోత్సవం

శ్రీశైలం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : శ్రీశైల మహాక్షేత్రంలో సోమవారం వార్షిక ఆరుద్రోత్సవం వేడుకను దేవస్థానం వైభవంగా జరిపింది. పర్వదినం సందర్భంగా ఆదివారం రాత్రి 12 గంటలకు మల్లికార్జునస్వామివారికి మహాన్యాసపూర్వక లింగోద్భవకాల ఏకాదశ రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన నిర్వహించారు. సోమవారం తెల్లవారుజామున మంగళవాయిద్యాలు, స్వామివారికి సుప్రభాతసేవ నిర్వహించి తరువాత స్వామి, అమ్మవార్లకు ప్రాతఃకాలపూజలు జరిపించి అనంతరం అమ్మవార్లకు విశేషపూజాధికాలు, నందివాహనసేవ నిర్వహించారు. ఉత్తరద్వారమైన శివాజీ గోపురం నుంచి వెలుపలకి తీసుకువచ్చి గ్రామోత్సవం నిర్వహించారు. పుష్యశుద్ధ ఏకాదశిని పురస్కరించుకుని సాయంత్రం 6.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు విశేష పుష్పార్చన నిర్వహించారు.



గ్రామోత్సవంలో స్వామి, అమ్మవార్లు

గోదా రంగనాథుల కల్యాణోత్సవం

కర్నూలు కల్చరల్, జనవరి 13(ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారు మామిదాల పాడులోని గోదా రంగనాథ స్వామి దేవస్థానం (గోదా గోకుల క్షేత్రం)లో ధనుర్మాస వేడుకలు వైభవంగా సాగుతున్నాయి. సోమవారం గోదా రంగనాథుల లఘు కల్యాణోత్సవం కన్నులపండువగా సాగింది. ధనుర్మాస నిత్యారాధనల్లో భాగంగా వేకువ జామున 4:30 గంటలకు అర్చకులు శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామి వారికి, గోదాదేవి, శ్రీకృష్ణులకు సాలగ్రామాలకు పంచసూక్త పారాయణంతో అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. తోమాల సేవ, తిరుప్పావై పఠనం చేశారు. అనంతరం శ్రీరంగనాథ, శ్రీలక్ష్మీ, శ్రీగోదాదేవి అమ్మవార్లకు శతనామార్చన, తిరుప్పావై గానం చేశారు. ఆలయంలో భోగి పండుగ వేడుకలను, సాయంత్రం గోదా రంగనాథుల లఘు కల్యాణాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గోదా గోకుల క్షేత్రం వ్యవస్థాపక అధ్యక్షులు మారం నాగరాజ గుప్త, మేనేజింగ్ ట్రస్టీ పల్లెర్ల నాగరాజు, గోకులం సభ్యులు పాల్గొన్నారు.



గోదా రంగనాథులకు లఘు కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

కృష్ణానదిలో చేపల మాఫియా



(7వ పేజీ తరువాయి)

పౌల్ట్రీ ఫాంలకు ఎండు చేపలు ఎగుమతి: ప్రతి ఏటా చేపల మాఫియా రూ.కోట్లలో దోచుకుంటోంది. అలవి వలల ప్రత్యేక ఏమిటంటే నీటిలో అగ్గిపుల్ల ఉన్నా కూడా ఈ వల లాగేస్తుంది. చిన్న చేపలను నది తీరం ప్రాంతంలోనే ఎండబెట్టి బస్తాలలో నింపి విజయవాడ, గుంటూరు, వైజాగ్ తదితర ప్రాంతాల్లోని పౌల్ట్రీ ఫాంలకు కి.లో. రూ.300 చొప్పున రాత్రి వేళల్లో అక్రమంగా రవాణా చేస్తున్నారు. ఎండు చేపల వ్యాపారులు ప్రతి ఏటా రూ.కోట్లకు పడగలు ఎత్తుతున్నారు. ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా కొనసాగుతోంది.

పారిపోవాలని చూస్తే ప్రాణం మీదికే

చేపలు పట్టేందుకు వచ్చిన కార్మికులు ఇంటికి వెళ్లేందుకు ప్రయత్నిస్తే.... నదిలోనే గుర్తు తెలియని శవాలుగా తేలుతాయనే ప్రచారం ఉంది. .తమకు ఎదురుతిరిగిన కార్మికులను మత్స్య మాఫియా బతకనివ్వదనడానికి ఎన్నో ఉదాహరణలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఫిబ్రవరి నుంచి ఏప్రిల్ నెలల మధ్యలో అటు తెలంగాణ రాష్ట్రంలో, ఇటు నంద్యాల జిల్లాలోని పగిడ్యాల, జూపాడుబంగ్లా, పాములపాడు, కొత్తపల్లి మండలాల పోలీస్‌స్టేషన్‌లలో కేసులు నమోదు అవుతూనే ఉంటాయి.

34 మందిపై బైండోవర్ కేసు నమోదు

కృష్ణానదిలో చేపల వేట కొనసాగించేందుకు వచ్చిన 34 మంది మత్స్యకారులపై ముచ్చుమర్రి పోలీస్‌స్టేషన్‌లో జనవరి 4వ తేదీన బైండోవర్ కేసు నమోదైయింది. వివిధ ప్రాంతాల నుంచి చేపల వేట కొనసాగించేందుకు కొంత మంది మైనర్ బాలురులను తీసుకొని వచ్చి ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. ఈ విషయంలో 34 మందిపై బైండోవర్ కేసు నమోదు చేశారు.



మత్స్యకారులతో మాట్లాడుతున్న ముచ్చుమర్రి ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి(ఫైల్)

కన్నెత్తి చూడని మత్స్యశాఖ అధికారులు

ఒకరోజు కాదు...రెండు రోజులు కాదు... దాదాపు 5 నెలల పాటు జరిగే ఈ చేపల మాఫియా ఏ అధికారికీ కనిపించడం లేదు. కృష్ణానదిలో జరుగుతున్న అలవి వలలతో అక్రమంగా సాగుతున్న చేపల వేటను అరికట్టాల్సిన మత్స్యశాఖ అధికారులు ఆ వైపు కన్నెత్తి చూసిన దాఖలాలు లేవు. మత్స్యశాఖ అధికారులు జాలర్లతో మాఫియాతో కుమ్మక్కు అవడం వల్లే ఈ ఫిషింగ్ మాఫియా యథేచ్ఛగా జరుగుతుందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బానిసలుగా కార్మికులు

నందికొట్కూరు మండలం శాతనకోట గ్రామం నుంచి జానాలగూడెం, బలపాలతిప్ప, పాతాళగంగ వరకు మొత్తం నదిలో దాదాపు 60 బ్యాచ్‌లు చేపల వేట కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఒక్కొక్క బ్యాచ్‌లో 20 నుంచి 30 మంది వరకు చేపలు పట్టే వారు ఉంటారు. ఇలా ఒక్కొక్క గుంపు మేస్త్రీ రెండు లేదా మూడు వలలను సిద్ధం చేసుకొని మత్స్యకారులకు భోజన, వసతి సదుపాయాలు కల్పించి మత్స్య సందపను దోచుకుంటున్నారు. జూన్ నుంచి ఫిబ్రవరి, మార్చి వరకు శ్రీశైలం ప్రాజెక్టులో తిరుగు జలాలు నిల్వ ఉంటాయి. మత్స్య మాఫియా జాలర్లకు అడ్వాన్సుగా డబ్బులు ఇచ్చి తమ ఆధీనంలో ఉంచుకుంటారు. చేపలు పట్టడానికి వచ్చే వారంతా వైజాగ్, తమిళనాడు, ఒరిస్సా ప్రాంతాలకు చెందిన వారే ఎక్కువ. అక్కడి నుంచి వీరిని కొంత డబ్బులు ముందుగానే చెల్లించి నాలుగు, ఐదు నెలల పాటు ఉండాలని ఒప్పందంపై ఇక్కడికి తీసుకొస్తారు.



కృష్ణానదీ తీరంలో ఎండబెట్టిన చేపలు



నీలకంఠేశ్వరుని ప్రాభవం



విద్యుత్ దీపాలంకరణతో వెలిగిపోతున్న నీలకంఠేశ్వర స్వామి ఆలయం

- ఎమ్మిగనూరులో మొదలైన ఉత్సవాలు
- కన్నుల పండువగా శివ పార్వతుల కళ్యాణం



ఎమ్మిగనూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): చేనేతపురి.. ఎమ్మిగనూరు ప్రజల ఆరాధ్యదైవం నీలకంఠేశ్వరుని ఉత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో మొదటిరోజు నీలకంఠేశ్వర స్వామి ఆలయంలో ఆది దంపతులైన పార్వతీపరమేశ్వరుల కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని పుష్పరథంపై ఊరేగించారు. రాత్రి ఆలయంలో వరుడు మహాశివుడి తరఫున గడిగె కుటుంబానికి చెందిన వారు, వధువు పార్వతీదేవి తరఫున బండ కుటుంబానికి చెందినవారు పెద్దలుగా వ్యవహరించి వివాహ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వార్లకు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి పట్టువస్త్రాలు సమర్పించారు. అలాగే స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేసి స్వామివారి కళ్యాణోత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ పూజారులు, వంశ పారంపర్య ధర్మకర్త కుటుంబ సభ్యులు, పాల్గొన్నారు.

విద్యుత్ దీపాల అలంకరణ: నీలకంఠేశ్వర స్వామి జాతరను పురస్కరించుకొని స్వామివారి ఆలయాన్ని విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. పట్టణంలోని పలు ప్రధాన రహదారుల్లో, కూడళ్లలో తోరణాలు ఏర్పాటు చేశారు. దీంతో ఊరంతా శోభాయమానంగా మారింది.



అర్ధరాత్రి 12 గంటల సమయంలో కల్యాణ మహోత్సవాన్ని నిర్వహిస్తున్న అర్చకులు



స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న ఎమ్మెల్యే జయనాగేశ్వర రెడ్డి

కమనీయం.. అంబా భవాని రథోత్సవం

- వేలాదిగా తరలి వచ్చిన భక్తులు
- పాల్గొన్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, మంత్రాలయం ఇన్‌చార్జి రాఘవేంద్రరెడ్డి



అశేష జనవాహిని నడుమ ముందుకు సాగుతున్న అంబా భవాని రథం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు, రథం

కోసిగి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అర్లబండ గ్రామంలో అంబా భవాని రథోత్సవం సోమవారం రమణీయంగా సాగింది. వెంకమాంబ కృష్ణావధూత పీఠాధిపతి మర్రిస్వామితాత, కృష్ణస్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అశేష జనవాహిని మధ్య రథోత్సవం నిర్వహించారు. కర్నూలు పార్లమెంటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, మంత్రాలయం టీడీపీ ఇన్‌చార్జి రాఘవేంద్రా రెడ్డి అమ్మవారిని దర్శించుకుని మఠం పీఠాధిపతి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ వేడుకలకు మన రాష్ట్రంతో పాటు కర్ణాటక నుంచి వేలాదిగా పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. కోసిగి ఎస్‌ఐ చంద్రమోహన్, కౌతాళం సీఐ అశోక్ కుమార్, మాధవరం ఎస్‌ఐ విజయకుమార్ గట్టి బందోబస్తు నిర్వహించారు. టీడీపీ నాయకులు ముత్తురెడ్డి, పల్లెపాడు రామిరెడ్డి, ఆర్లబండ సర్పంచ్ మల్లికార్జున, అయ్యప్ప, జ్ఞానేష్, నాడిగేని అయ్యన్న పాల్గొన్నారు.



రథోత్సవంలో పాల్గొన్న పాలకుర్తి తిక్కారెడ్డి, రాఘవేంద్రరెడ్డి



బైక్‌పై నుంచి పడి ఒకరి మృతి : ఇద్దరికి గాయాలు

ఆలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఆలూరు మండలం పెద్దహోతూరు సమీపంలో బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న రాయిని ఢీకొట్టడంతో బళ్లారికి చెందిన గాజుల చంద్రశేఖర్(50) అక్కడికక్కడే మృతి చెందాడు. బైకుపై ఉన్న మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. బళ్లారిలో గాజుల షాపు పెట్టుకొని జీవనం సాగిస్తున్న గాజుల చంద్రశేఖర్ సోమవారం తన ద్విచక్ర వాహనంపై సమీప బంధువు వీరేష్, ఆయన కుమారుడు గీతేష్ పత్తికొండలో ఉన్న పులికొండ రంగస్వామి దర్శనం కోసం బయల్దేరారు. దర్శనం చేసుకొని తిరిగి బళ్లారి వెళ్తుండగా పెద్దహోతూరు వద్ద సాయంత్రం 6గంటలకు జరిగిన ప్రమాదంలో చంద్రశేఖర్ మృతి చెందాడు. చంద్రశేఖర్‌కు భార్య నాగమణి, కూతురు శబరి ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ దిలీప్‌కుమార్ తెలిపారు.

కోడిపందేల స్థావరంపై పోలీసుల దాడులు

మహానంది, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం బసవాపురం గ్రామ సమీపంలోని నల్లమల అటవీ ప్రాంతంలో సోమవారం కోళ్ల పందేల స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఉమ్మడి జిల్లాల నుంచి పదుల సంఖ్యలో పందెం రాయుళ్లు పాల్గొని కోళ్ల పందేలు ఆడుతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ రామ్మోహన్‌రెడ్డి తన సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. ఇందులో భాగంగా 12 మందిని అదుపులోకి తీసుకున్నారు. మిగతా పందెం రాయుళ్లు పరారీ అయ్యారు. ఈ దాడుల్లో రూ.23,500 నగదుతోపాటు 20 మోటార్ బైకులతోపాటు ఒక ఆటో, ఐదు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు.

వివాహిత ఆత్మహత్య

పాణ్యం, జనవరి13 (ఆంధ్రజ్యోతి): స్థానిక చాకలిపేటకు చెందిన వివాహిత చాకలి తులసి (32) సోమవారం ఆత్మహత్య చేసుకుందని వైద్య సిబ్బంది తెలిపారు. విషం కలిసిన నీళ్ల తాగడంతో బంధువులు పాణ్యం సీహెచ్‌సీకి తరలించారని చెప్పారు. చికిత్స పొందుతూ మృతి చెందిందన్నారు.

బయల్పడిన సంగమేశ్వర ఆలయ గోపురం



గోపురానికి పూజలు చేస్తున్న పురోహితుడు తెలకపల్లి రఘురామశర్మ

కొత్తపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆంధ్ర, తెలంగాణ సరిహద్దుల్లో ఉన్న సప్తనదుల సంగమేశ్వరాలయం శ్రీశైలం బ్యాక్‌వాటర్ నుంచి మెలమెల్లగా బయల్పడుతూ గోపురం సోమవారం సాయంత్రం భక్తులకు ఇలా దర్శనమిచ్చింది. దీంతో ఆలయ పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఎగువ ఉమామహేశ్వరస్వామి ఆలయం నుంచి మరబోటు ద్వారా వెళ్లి నదిలో బయల్పడిన ఆలయ గోపురానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమవారం సాయంత్రం 6 గంటల సమయానికి శ్రీశైలం ప్రాజెక్టు నీటి మట్టం 885 అడుగులకుగాను 857.60 అడుగులు కాగా, రిజర్వాయర్ పూర్తి స్థాయి నీటి నిల్వలు 215 టీఎంసీలకు గానూ, 98.9024 టీఎంసీలుగా నమోదైంది. దీంతో సంగమేశ్వర ఆలయ గోపురం సోమవారం సాయంత్రానికి ఆలయ గోపురం పూర్తిగా బయల్పడింది. నీటి విడుదల ఇలాగే కొనసాగితే రానున్న శివరాత్రి కల్లా సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనం ఇచ్చే అవకాశం ఉంది.

సంక్రాంతి శుభాకాంక్షలు : డీసీసీ



పి.మురళీకృష్ణ



లక్ష్మీనరసింహ యాదవ్

నంద్యాల/కర్నూలు అర్బన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా ప్రజలకు డీసీసీ జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనరసింహ యాదవ్, పి.మురళీకృష్ణ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. హిందువులకు అతి ముఖ్యమైన పండుగని, ప్రతి ఒక్కరూ కుటుంబ సభ్యులతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. భోగ భాగ్యాల భోగి, సుఖ సంతోషాల సంక్రాంతి, కమ్మని వంటల కనుమ కలబోసి ఆనందం వెల్లివిరియాలని సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రజలతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు ఆయన సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంస్కృతి సంప్రదాయాలకు సొంత గ్రామాల మీద మమకారానికి, రైతులకు ఇచ్చే గౌరవానికి ప్రతీక మకర సంక్రాంతి అని పేర్కొన్నారు. జిల్లా

ఆలయంలో చోరీ

ఆదోని రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంతేకుడ్లూరు గ్రామంలో సోమవారం అర్ధరాత్రి తర్వాత దొంగలు సిద్దలింగేశ్వర ఆలయంలోచోరీకి పాల్పడ్డారు. భీమక్క, మాదమ్మ అమ్మవార్ల గొంతులోని బంగారు మంగళసూత్రాలను అపహరించారు. ఆభరణాల విలువ రూ.40వేలకు పైగా ఉంటుందని కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్.ఐ నాగేంద్ర తెలిపారు.

పోలీసుల అదుపులో దొంగలు..

కాగా గ్రామస్థులు దొంగలను పట్టుకొని ఇస్వి పోలీసులకు అప్పజెప్పినట్లు విశ్వసనీయ సమాచారం.

పూర్తయిన గోకులం షెడ్లు

- సంక్రాంతి సందర్భంగా మూడు రోజులపాటు ప్రారంభోత్సవాలు



క్రిష్ణగిరిలో సిద్ధమైన గోకులం షెడ్డు

కర్నూలు అగ్రికల్చర్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు నీడ కల్పించాలనే సదుద్దేశంతో ఉపాధి హామీ పథకం కింద ఏర్పాటు చేస్తున్న గోకులం షెడ్ల నిర్మాణాలు చకచకా పూర్తవుతున్నాయి. రెండు జిల్లాలో 2వేల దాకా గోకులం షెడ్లు మంజూరయ్యాయి. జిల్లా నీటి యాజమాన్య సంస్థ 90 శాతం సబ్సిడీతో వీటిని మంజూరు చేసి నిధులను ఖర్చు చేస్తుంది. కేవలం 10 శాతం ఖర్చు మాత్రమే రైతు భరించాలి. సంక్రాంతి పండుగ సందర్భంగా కూటమి ప్రభుత్వం పూర్తయిన గోకులాల షెడ్లను ఆయా నియోజకవర్గాల్లోని ప్రజాప్రతినిధుల చేత 10 నుంచి 12వ తేదీ వరకు ప్రారంభించి రైతుల్లో సంతోషం నింపింది. కర్నూలు జిల్లాలో 320 గోకులం షెడ్లు, నంద్యాల జిల్లాలో 700 గోకులం షెడ్లు పూర్తి కాగా, శనివారం రెండు జిల్లాలో ప్రజాప్రతినిధుల చేత ప్రారంభోత్సవాలు జరిగాయి. ఒక్కో గోకులం షెడ్డుకు రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు ప్రభుత్వం కేటాయించింది. గత ఏడాది కర్నూలు జిల్లాలో 1200, నంద్యాల జిల్లాలో 850 గోకులం షెడ్లు మంజూరయ్యాయి. ఈ షెడ్లను నిర్మించుకునేందుకు రైతుల వద్ద పోటీ వాతావరణం నెలకొంది. ఇప్పటి దాకా పాడి పశువులను ఎక్కడ ఉంచాలో తెలియక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనేవారు. ప్రభుత్వం జిల్లా నీటి యజమాన్య సంస్థ ఆధ్వర్యంలో 90 శాతం సబ్సిడీని భరించి గోకులాల ఏర్పాటుకు పచ్చజెండా ఊపడంతో రైతుల్లో సంతోషం వ్యక్తమవుతోంది. ఈ నెలాఖరుకల్లా గోకులం షెడ్లను పూర్తి చేసి రైతులకు అందిస్తామని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి శ్రీనివాసులు, నంద్యాల జిల్లా పశుసంవర్ధక అధికారి మోహన్ నాయక్ తెలిపారు.


పాములపాడు: రుద్రవరం గ్రామంలో ముగ్గుల పోటీలు


నంద్యాలలో హరిదాసు వేషధారణ


నంద్యాలలో గంగిరెద్దు ఆట

సంక్రాంతి సంబరం


వెలుగోడులో భోగి మంట


జూపాడుబంగ్లా: తరిగోపులలో బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య


నంద్యాల: సంజీవనగర్ రామాలయంలో గోదాదేవి సమేత రంగనాథ స్వామి కళ్యాణం


ఆత్మకూరులో గోదాదేవి సమేత రంగనాథ స్వామి కళ్యాణం

సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. సంక్రాంతి పండుగ భోగి సందర్భంగా సోమవారం మహిళలు తమ ఇళ్ల ముందు రకరకాల రంగవల్లులు వేసి తమలోని ప్రతిభను చాటుకున్నారు. ఇండ్ల ముందు భోగి మంటలు వేశారు. భోగభాగ్యాలను కలిగించే భోగి, సిరిసంపదలను తీసుకొచ్చే సంక్రాంతి, కనువిందు చేసే కనుమలను ప్రజలు ఘనంగా జరుపుకుంటు న్నారు. పలువురు ప్రముఖులు జిల్లా ప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఆనాది నుంచి వస్తున్న సాంప్రదాయలను కొనసాగించాలని, సంక్రాంతి పండుగ వాతావరణం ఆనందోత్సాహాలను నింపుతుందని నందికొట్కూరు ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. మండలంలోని తరిగోపుల గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలను ఆయన ప్రారంభించారు. సంస్కృతి సాంప్రదాయాలకు అద్దం పట్టే పండుగ సంక్రాంతి అని టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ అన్నారు. అలాగే మహిళలు ఆత్మగౌరవం సంక్రాంతి పండుగ అని పేర్కొన్నారు. సోమవారం నంద్యాల టీడీపీ కార్యాలయంలో సంక్రాంతి పండుగ పురస్కరించుకొని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. - న్యూస్ నెట్ వర్క్


గడివేములలో భోగి మంటలు


ఆత్మకూరులో..


నంద్యాలలో..


మహానందిలో భోగి పండ్ల ఉత్సవంలో పాల్గొన్న చిన్నారులు, తల్లిదండ్రులు


అన్నాభిషేకం పూజలు నిర్వహిస్తున్న వేదపండితులు

మహా నందీశ్వరుడికి అన్నాభిషేకం

మహానంది, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమితో పాటు పరమశివుని జన్మ నక్షత్రం ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకొని సోమవారం తెల్లవారుజామున వేదపండితులు ఘనంగా అన్నాభిషేకాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ప్రధాన ఆలయంలో స్వయంభువుగా వెలసిన నందీశ్వరునికి మూడుగంటల పాటు అన్నాభిషేకం పూజలను వేదమంత్రాలతో జరిపారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణి చేసారు. ఈ కార్యక్రమానికి దాతగా హైదరాబాద్‌కు చెందిన వారణాశి రామ్మోహన్‌రావు దంపతులు వ్యవహరించారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రాతకోటలో నేడు మహిళా కబడ్డీ పోటీలు

పగిడ్యాల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల పరిధిలోని తూర్పు ప్రాతకోట గ్రామంలో మంగళవారం జాతీయ స్థాయి మహిళ కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పోటీలలో గెలుపొందిన జట్లులకు మొదటి బహుమతి రూ.40 వేలు, 2వ బహుమతి రూ.30 వేలు, 3వ బహుమతి రూ.20 వేలు, 4వ బహుమతి రూ. 10 వేలు అందజేస్తామన్నారు. పోటీలలో పాల్గొనే జట్లు ఎంట్రీ ఫీజు రూ. 500 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

పూర్వ విద్యార్థుల కమిటీ ఎన్నిక

కొత్తపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లి మండలం గోకవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పూర్వ విద్యార్థుల సేవాసమితి కమిటీని పూర్వ విద్యార్థులు, గ్రామ పెద్దలతో కలిసి ఎన్నుకున్నారు. సోమవారం వారు గోకవరంలో ఈ కమిటీ గౌరవ సలహాదారుడుగా ప్రధానోపాధ్యాయులు వెంకటస్వామిని, అలాగే కమిటీ అధ్యక్షులుగా డా.మన్సూర్‌బాషా, ఉపాధ్యక్షులు పుల్యాల చంద్రారెడ్డి (సాఫ్ట్‌వేర్ ఇంజనీర్), ప్రధాన కార్యదర్శి ఎం.రామకృష్ణ (భక్తకన్నప్ప గురుకులం), ట్రెజరర్ వెంకటరమణ (ఉపాధ్యాయుల)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే ఈ కమిటీకి సహ ఉపాధ్యక్షులు, కార్యదర్శులు, సేవా కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులుగా 23 మందిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పూర్వ విద్యార్థి నూతన కమిటీ అధ్యక్షుడు డా. మన్సూర్ బాషా మాట్లాడుతూ ఏర్పాటు చేసి భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

నాటుసారా స్థావరాలపై దాడులు

నందికొట్కూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు పట్టణంలోని నీలి షికారి కాలనీలోని నాటు సారా స్థావరాలపై నందికొట్కూరు ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ జప్రూల్లా ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో 600 లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో హెడ్‌కానిస్టేబుల్ కుమారి, శంకర్ నాయక్, పద్మనాభం, కానిస్టేబుళ్లు సుధీర్, శివన్న, రమీజా, శ్వేత పాల్గొన్నారు.

రేపు బండలాగుడు పోటీలు

పగిడ్యాల, జనవరి 13(ఆంధ్రజ్యోతి): పడమర ప్రాతకోట గ్రామంలో కాశీవిశ్వేశర, నందీశ్వర స్వామి తిరుణాల సందర్భంగా ఈ నెల 15న అంతర్ రాష్ట్ర స్థాయి ఎద్దుల బండలాగుడు పోటీలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీలలో పాల్గొనే ఎద్దుల యజమానులు ప్రవేశ రుసుము రూ. 600 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

తాండవ మల్లేశ్వర స్వామి ఉత్సవాలు ప్రారంభం

కొత్తపల్లి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో వెలసిన తాండవ మల్లేశ్వరస్వామి ఉత్సవాలు ఆలయ కమిటీ గ్రామ పెద్దల సహకారంతో ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటి రోజు స్వామివారికి భాజాభజంత్రీల మధ్య ఉదయం బిందె సేవ, రుద్రాభిషేకం, పుష్పార్చన, మహా మంగళహారతి, సాయంత్రం ప్రదోషకాల పూజలు జరిగాయి. మంగళవారం ఉదయం ప్రత్యేక పూజల అనంతరం రాత్రి 8.15 గంటలకు మకర సంక్రమణ ఉత్తరాయణం పుణ్యకాలంలో పార్వతి పరమేశ్వరుల కళ్యాణం ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేశారు.

మహోన్నత కార్యం రక్తదానం

నంద్యాల రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి); మహోన్నత కార్యం రక్తదానమని ప్రముఖ యోగా గురువు ఆనంద్‌గురూజి పేర్కొన్నారు. సోమవారం నంద్యాల పట్టణం శ్రీనివాస సెంటర్‌లోని వీమార్ట్‌లో ఫ్రెండ్స్‌ఫర్ సేవా ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఫ్రెండ్స్‌ఫర్ సేవా అధ్యక్షుడు ఠాగూర్ ఫణీంద్ర మాట్లాడుతూ ప్రతి ఒక్కరు రక్తదానం చేయడానికి ముందుకు రావాలని అన్నారు.

మంచాలకట్టలో కబడ్డీ పోటీలు

గడివేముల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మంచాలకట్ట గ్రామంలో దివ్య బాలయేసు పండుగ సందర్భంగా జిల్లాస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం నిర్వహించారు. ఈ పోటీలలో 50 జట్లు తలపడగా గోనెగండ్ల జట్టు మొదటి స్థానం, నూతనపల్లి జట్టు రెండో స్థానం, పంచలింగాల జట్టు మూడో స్థానం, శివనంది జట్టు నాలుగో స్థానం, మంచాలకట్ట జట్టు ఐదో స్థానం, గడివేముల జట్టు ఆరో స్థానంలో నిలిచాయి.

భోగి మంటల్లో విద్యుత్ బిల్లుల దహనం

నందికొట్కూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ట్రూ అప్ చార్జీల పేరుతో విద్యుత్ చార్జీలు పెంచిన బిల్లులను నందికొట్కూరు పట్టణంలో భోగి మంటల్లో వేసి దహనం చేశారు. సోమవారం సీపీఎం ఆధ్వర్యంలో నందికొట్కూరు పట్టణంలోని ట్యాంక్ ఏరియా, హాజీన గర్, బీఆర్‌ఆర్ నగర్‌లలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నాగేశ్వరరావు మాట్లాడుతూ ప్రజలను నమ్మించి మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వానికి ప్రజలు తగిన విధంగా బుద్ధి చెప్పాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు జగన్మోహన్‌రెడ్డి విద్యుత్ చార్జీలు పెంచిన సందర్భంగా బాదుడే బాదుడు అని పెద్ద ఎత్తున కార్యక్రమాలు చేపట్టి విద్యుత్ చార్జీలు పెంచబోమని, అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లోనే కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచి ప్రజలను నమ్మించి మోసం చేసిందన్నారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే ధ్వంసం చేయమని పిలుపునిచ్చిన టీడీపీ, జనసేనలు నేడు అదే స్మార్ట్ మీటర్లను బిగిస్తుండడం పట్ల ప్రజలకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు గోపాలకృష్ణ, స్వాములు, వెంకటేశ్వర్లు, స్వామి నాయుడు, లక్ష్మన్న తదితరులు పాల్గొన్నారు.

పగిడ్యాల: మండల పరిధిలోని నెహ్రూనగర్ గ్రామంలో సీపీఎం నాయకుల ఆధ్వర్యంలో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులను తగలబెట్టి సోమవారం నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం మండల కన్వీనరు పక్కీర్‌సాహెబ్, ప్రజా సంఘాల నాయకులు ఈశ్వరమ్మ, వెంకటేశ్వర్లు, సుధాకర్, రామచంద్రుడు పాల్గొన్నారు.

ఆత్మకూరు: రాష్ట్రంలో విద్యుత్ చార్జీలను పెంచడాన్ని నిరసిస్తూ సీపీఎం నాయకులు నిరసన చేపట్టారు. సోమవారం సంక్రాంతి సంబరాల్లో భాగంగా భోగి పండుగను పురస్కరించుకుని పట్టణంలోని గరీబ్‌నగర్, గౌడ్‌సెంటర్, నంద్యాల టర్నింగ్, గొల్లపేట, వీరభద్ర ఏరియా తదితర చోట్ల భోగి మంటలు ఏర్పాటు చేసి అందులో విద్యుత్ బిల్లులను దహనం చేశారు. కార్యక్రమంలో రణధీర్, రామ్‌నాయక్, సురేంద్ర, నాగేశ్వరరావు, రైతు సంఘం నాయకులు మహెబూబ్‌బాషా పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆధీనంలో ఉన్న మార్కెట్‌లను ప్రైవేట్ పరం చేయాలని కేంద్ర ప్రభుత్వం జీవో విడుదల చేయడం సరికాదని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి రాజశేఖర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ నాగన్న అన్నారు. సోమవారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జీవో కాపీలను భోగి మంటల్లో దహనం చేశారు.


నందికొట్కూరులో విద్యుత్ బిల్లులను భోగి మంటల్లో వేసి దహనం చేస్తున్న సీపీఎం నాయకులు


ఆత్మకూరులో భోగి మంటల్లో విద్యుత్ బిల్లులు...

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

పారువేట ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి: సీఐ

చాగలమర్రి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పర్వదినం సందర్భంగా ఆళ్లగడ్డ రూరల్ పోలీసు సర్కిల్ పరిధిలోని ఆయా మండలాల్లో పారువేట ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి హెచ్చరించారు. మండలంలోని గొడిగనూరు గ్రామంలో గ్రామ పెద్దలు, వివిధ పార్టీల నాయకులతో ఆదివారం రాత్రి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కోడి పందేలు, పేకాట, జూదం నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. కార్యక్రమంలో ఆళ్లగడ్డ రూరల్ ఎస్‌ఐ హరిప్రసాద్, హెచ్‌సీ శంకరయ్య, పోలీసులు పాల్గొన్నారు.


బేతంచెర్లలో ఇంటి ముందు వేసుకున్న ముగ్గు


ప్యాపిలిలో ముగ్గు వేస్తున్న బాలికలు


ఎస్.చెన్నంపల్లెలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

వైభవంగా భోగి

- ఇళ్ల ముందు ముగ్గులు వేసిన మహిళలు
- చిన్నారులకు భోగి పండ్లు పోసిన తల్లిదండ్రులు

బేతంచెర్ల/బనగానపల్లె/ప్యాపిలి/దొర్నిపాడు/అవుకు/డోన్‌రూరల్/ జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగను పురస్కరించుకుని సోమవారం భోగి పండుగను గ్రామాలతో పాటు పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. ఇళ్ల ముందు మహిళలు రంగు రంగుల ముగ్గులు వేసి గొబ్బెమ్మలు పెట్టి అందంగా తీర్చిదిద్దారు. గుమ్మడి కాయలను కొట్టి పూజలు చేశారు. అనంతరం నువ్వుల నూనెతో తలంటుకుని స్నానాలు ఆచరించి తల్లిదండ్రులు తమ పిల్లలకు భోగిపండు పోసి ఆశీర్వదించారు. డోన్ డీఎస్పీ పి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆర్‌అండ్‌బీ గెస్టు హౌస్ ప్రాంగణంలో మహిళలకు ముగ్గుల పోటీలను నిర్వహించారు. పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచిన ముగ్గురు మహిళలకు డీఎస్పీ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ సీఐ ఇంతియాజ్ బాషా, రూరల్ సీఐ రాకేష్‌బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

చాగలమర్రి: మండలంలో భోగి పండుగను ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం కన్యకాపరమేశ్వరి, కోటగడ్డ, మల్లేంవీధులలో భోగిమంటలు వేసి నృత్యాలు చేశారు. వివిధ రంగుల ముగ్గులను వేసి గొబ్బెమ్మలు పెట్టి పూజలు చేశారు. సాయి బాబా ఆలయంలో సాయిబాబాకు భోగి పండ్లతో జలాభిషేకం చేశారు.


చాగలమర్రిలో భోగి మంట ముందు మహిళల సందడి

భోగి మంటల్లో కరెంటు బిల్లుల దహనం

డోన్ రూరల్ : ఎన్డీయే కూటమి ప్రభుత్వం సర్దుబాటు పేరుతో విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై మోపడం సరికాదని సీపీఎం నాయకులు అన్నారు. సోమవారం సీపీఎం కార్యాలయం వద్ద భోగి మంటల్లో కరెంటు బిల్లులు వేసి దహనం చేశారు. కార్యక్రమంలో సీపీఎం పట్టణ కార్యదర్శి నక్కి శ్రీకాంత్, సీఐటీయూ నాయకులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: పట్టణంలోని డ్రైవర్స్ కాలనీ, కోటపేట, హనుమాన్‌నగర్, సంజీవనగర్‌లో విద్యుత్ బిల్లుల ప్రతులను భోగి మంటల్లో వేసి సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు.


అవుకులో భోగి మంటలు వేసిన యువకులు


రామచంద్రాపురంలో భోగి మంటలు


బేతంచెర్లలో విద్యుత్ బిల్లులను దహనం చేస్తున్న సీపీఐ నాయకులు

నాపరాతి డిపోల యజమానులకు నోటీసులు

- 16న పరిశీలనకు రానున్న ఆర్డీవో
- ఆక్రమణలో అవుకు రిజర్వాయర్ కథనానికి స్పందన

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అవుకు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అవుకు రిజర్వాయర్ వెంట నాపరాతి డిపోలను ఏర్పాటు చేసుకున్న ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినట్లు ఎస్సార్బీసీ ఈఈ సురేష్‌బాబు సోమవారం తెలిపారు. ఈనెల 4న 'ఆంధ్రజ్యోతి'లో ఆక్రమణలో అవుకు రిజర్వాయర్ కథనం ప్రచురితమైంది. దీంతో అధికారుల్లో కదలిక మొదలైంది. ఈ సందర్భంగా ఈఈ సురేష్‌బాబు మాట్లాడుతూ నాపరాయి డిపోల యజమానులు వేస్టేజీని రిజర్వాయర్‌లోకి ఎక్సకవేటర్లతో తోచేస్తున్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెర్లోపల్లె పంచాయతీ కార్యాలయం అధికారులు 15 మంది ఆక్రమణ దారులకు నోటీసులు ఇచ్చారన్నారు. దీనిపై ఈనెల 16న డోన్ ఆర్డీవో నరసింహులు రిజర్వాయర్ వెంట ఆక్రమించిన స్థలాలతో పాటు, ప్రభుత్వ స్థలాల ఆక్రమణను స్వయంగా పరిశీలించనున్నారు. నాపరాతి డిపోల యజమానులు ఆక్రమించుకున్న స్థలాలను ఖాళీ చేయించే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు.


రిజర్వాయర్‌లో డంప్ చేసిన నాపరాయి వేస్టేజీ

అశ్రునయనాలతో చాంద్‌బాషా అంత్యక్రియలు

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 13(ఆంధ్రజ్యోతి) : రహదారి ప్రమాదంలో దుర్మరణం చెందిన ఆళ్లగడ్డ మాజీ జడ్పీటీసీ, టీడీపీ నాయకుడు సుద్దపల్లె చాంద్‌బాషా అంత్యక్రియలను కోటకందుకూరు గ్రామంలో కుటుంబసభ్యులు, టీడీపీ శ్రేణులు అశ్రునయనాలతో సోమవారం నిర్వహించారు. టీడీపీ ఆళ్లగడ్డ యువ నాయకుడు భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి కోటకందుకూరు గ్రామానికి చేరుకుని చాంద్‌బాషా మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అంత్యక్రియలకు తీసుకెళ్తున్న చాంద్‌బాషా మృతదేహాన్ని జగత్ విఖ్యాత్‌రెడ్డి మోసుకెళ్లారు. చాంద్‌బాషా మృతి పార్టీకి తీరని లోటు అని.. ఆయన కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని విఖ్యాత్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ఆళ్లగడ్డ నియోజకవర్గంలోని పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు చాంద్‌బాషా మృతికి సంతాపం వ్యక్తం చేసి ఆయన అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

నివాళి అర్పించిన ఇరిగెల సోదరులు

జనసేన ఆళ్లగడ్డ నియోకవర్గ నాయకులు ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల సూర్య నారాయణరెడ్డి, పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు మాజీ జడ్పీటీసీ సుద్దపల్లె చాంద్‌బాషా మృతదేహానికి సంతాపం వ్యక్తం చేశారు. చాంద్‌బాషా అంత్యక్రియల్లో వారు పాల్గొన్నారు.


చాంద్‌బాషా మృతదేహాన్ని మోసుకెళ్తున్న భూమా జగత్ విఖ్యాత్‌రెడ్డి

మునగ చెట్ల నరికివేత

కొలిమిగుండ్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : కొన్నేళ్లుగా వివాదాస్పదంగా ఉన్న కొలిమిగుండ్ల మండలం చింతలాయపల్లె గ్రామానికి చెందిన సంజీవకుమార్‌రెడ్డి పొలంలో సాగు చేసిన 400 మునగ చెట్లను గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు నరికివేశారు. ఈ ఘటన ఆదివారం రాత్రి చోటు చేసుకోగా సోమవారం మండలంలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. పంట చేతికొచ్చే సమయంలో ఇలా చేశారని రూ.10లక్షకు పైగా నష్టం వాటిల్లినట్లు రైతు సంజీవకుమార్‌రెడ్డి వాపోయాడు. వివరాలు ఇలా ఉన్నాయి. అబ్దులాపురం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 88-1బి, 2,3 7.50 ఎకరాల పొలంపై చాలా కాలంగా వివాదం నడుస్తోంది. నీలం సంజీవకుమార్‌రెడ్డి సాగులో ఉన్నప్పటికీ, చట్ట ప్రకారం తమదేనంటూ అదే గ్రామానికి చెందిన దూదేకుల దస్తగిరి కుటుంబం వాదిస్తున్నారు. ఇటీవలే దూదేకుల దస్తగిరికే పొలం చెందుతుందని కోర్టు తీర్పునిచ్చింది. అయితే సంజీవకుమార్‌రెడ్డి ఇప్పటికే సుమారు రూ.20లక్షల వరకు పెట్టుబడి పెట్టి సాగులో ఉండటంతో అధికారులు దీన్ని ఎలా పరిష్కరించాలన్న అలోచన సాగిస్తున్నారు. ఈసమయంలోనే పొలంలోని మునగ చెట్లు నరికి వేయడంతో చర్చనీయాంశంగా మారింది. విషయం తెలిసిన వెంటనే కొలిమిగుండ్ల సీఐ రమేష్‌బాబు ఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. ప్రాథమిక దర్యాప్తు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు సీఐ తెలిపారు.


నరికిన చెట్లను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే

టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే..

వైసీపీ నాయకుడికి చెందిన మునగ చెట్లు టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే నరికి వేశారని జిల్లా పరిషత్ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి విమర్శించారు. చెట్లు నరికివేసిన పొలాన్ని పరిశీలించారు.

చౌడేశ్వరీ మాతకు సహస్ర దీపాలంకరణ

బనగానపల్లె, జనవరి13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నందవరంలో వెలసిన చౌడేశ్వరీమాత ఆలయంలో పౌర్ణమిని పురస్కరించుకొని సోమవారం చౌడేశ్వరీ మాతకు ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం చండీ హోమం నిర్వహించారు. సాయంత్రం చౌడేశ్వరీ మాత ఉత్సవ మూర్తులకు విశేష అ లంకరణ చేసి పల్లకీసేవ, సహస్ర దీపాలంకరణ సేవ ఘనంగా నిర్వహించారు. ఆలయ ఈవో కామేశ్వరమ్మ, పీ.వీకుమార్‌రెడ్డి, అధిక సంఖ్యలో భక్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

నడకతోనే ఆరోగ్యం

బనగానపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నడకతోనే ఆరోగ్య సమాజాన్ని నిర్మిద్దామని జేకేఆర్ సంక్షేమం అధ్యక్షుడు బ్రహ్మానందాచారి అన్నారు. బనగానపల్లె మండలంలోని పలుకూరు పాఠశాల మైదానంలో నడక ఆవశ్యకతపై కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో విజయ్, మధు,వెంకటేశ్, రాజా, పలుకూరు వాకింగ్ మిత్రబృందం పాల్గొన్నారు.

యాగంటిలో ఘనంగా పల్లకీ సేవ

బనగానపల్లె, జనవరి13 (ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని యాగంటి క్షేత్రంలో ఈనెల 19నుంచి శివదీక్షా మాలాధరణ ప్రారంభమవుతుందని ఈవో చంద్రుడు సోమవారం తెలిపారు. మార్చి 1న శివదీక్ష పూర్ణాహుతి కార్యక్రమం ఉంటుదని ఆయన తెలిపారు.

మాజీ ఎంపీ మృతికి నివాళి

కొలిమిగుండ్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : నాగర్ కర్నూల్ మాజీ ఎంపీ మందా జగన్నాథం అనారోగ్యంతో మృతి చెందడంతో కొలిమిగుండ్లలో ఆయనకు ఘన నివాళి అర్పించారు. మండల ఎంఎస్పీ అధ్యక్షుడు గోపాల్‌గారి దస్తగిరి, జిల్లా నాయకులు పసులూరి పెద్దనారాయణ ఆధ్వర్యంలో పలువురు ఎమ్మార్పీస్ కార్యకర్తలు మాజీ ఎంపీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మందా నారాయణ, రామచంద్ర, మాణిక్ బాషా, ప్రసాద్, వెంకటేష్, చిరంజీవి పాల్గొన్నారు.


మందా జగన్నాథం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంఎస్పీ, ఎమ్మార్పీస్ నాయకులు

వైభవంగా చండీ హోమం


మద్దూరులో హోమం చేస్తున్న వేద పండితులు

చాగలమర్రి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మద్దూరు గ్రామంలో వేద పండితులు కిషోర్‌శర్మ, సాయిశర్మ, భరద్వాజ ఆధ్వర్యంలో సోమవారం చండీ, గణపతి హోమాలను వైభవంగా నిర్వహించారు. కలశస్థాపన, రుద్రాభిషేకం, పూర్ణాహుతి కార్యక్ర మాలను నిర్వహించారు. ఉత్తర ముఖద్వారంలో వెలసిన ప్రసన్న వేంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. 15న మకర సంక్రాంతి సందర్భంగా గ్రామంలో ప్రసన్న వేంకటేశ్వరస్వామి పల్లకితో పారువేట ఉత్సవం నిర్వహించనున్నట్లు ఈవో నర్సయ్య, ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. పారువేట ఉత్సవాలను విజయవంతం చేయాలని వారు కోరారు.

సేవలు అభినందనీయం : బీసీ ఇందిరమ్మ


పేదలకు చెక్కులు పంపిణీ చేసిన బీసీ ఇందిరమ్మ

బనగానపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వసుదా ఫౌండేషన్ సేవలు అభినందనీయమని టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఆవరణంలో నంద్యాల జిల్లా పార్లమెంట్ నియోజకవర్గ వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య ఆధ్వర్యంలో వసుదా ఫౌండేషన్ చైర్మన్ చైర్మన్ మంతెన వెంకటరామరాజు సహకారంతో అనారోగ్యంతో బాధపడుతున్న పలువురు రోగులకు బీసీ ఇందిరమ్మ ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టీచర్ల నాగరాజు, ప్రతాప్, మల్లారెడ్డి, లాయర్ నాగ్రేందారెడ్డి, ఖాదర్, నగేశ్, జంగంశెట్టి, కూరగాయలశేఖర్, పవన్‌కుమార్‌రెడ్డి, ఎల్లయ్య పాల్గొన్నారు.

టీడీపీతోనే బీసీల సంక్షేమం

చాగలమర్రి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యమని మండల బీసీ సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణగౌడ్ తెలిపారు. సోమవారం బీసీ సంఘ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. బీసీలకు ఆదరణ పనిముట్లు అందించి ఆర్థికాభివృద్ధికి ప్రోత్సహించాలని అన్నారు. సమావేశంలో బీసీ సంఘ నాయకులు రామతీర్థం, పీరయ్య, సుబ్బరాయుడు, సిద్ధప్ప, లాలయ్య, చిన్ని కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

గొడిగనూరులో వేలం

చాగలమర్రి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడిగనూరు గ్రామంలో గ్రామ పెద్దల సమక్షంలో వేలం నిర్వహించారు. ఆళ్లగడ్డ రూరల్ సీఐ మురళీధర్‌రెడ్డి, ఎస్‌ఐ హరిప్రసాద్ పర్యవేక్షణలో పోలీసు బందోబస్తు మధ్య పుల్లరి, దేవాలయ మాణ్యం, గేటుకు సంబంధించిన వేలం నిర్వహించారు. పుల్లరి వేలం పాటలో రూ.2.5 లక్షలు వేలం పాట పలికింది. గేటు వేలం పాటలో రూ.1.77 లక్షలకు మల్లికార్జున పాటదారుడు దక్కించుకున్నాడు. 90 సెంట్ల దేవుడి మాణ్యం భూమికి జరిగిన వేలం పాటలో రామకృష్ణ రూ.31 వేలకు పాట పాడినట్లు తెలిపారు.

రైతు సంక్షేమమే లక్ష్యం

రుద్రవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే సీపీఎం, రైతు సంఘం లక్ష్యమని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేశ్‌కుమార్, కార్యదర్శి రామచంద్రుడు అన్నారు. సోమవారం ఆలమూరు గ్రామానికి చెందిన గోవిందరెడ్డి, సుంకన్న, రామక్రిష్ణ, చిన్న హుసేనీ, ఓబులేసు నరసింహ రైతు సంఘం సభ్యత్వం తీసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలు ప్రజా సంక్షేమమే రైతుల అభివృద్ధినే లక్ష్యంగా పనిచేస్తూ సమస్యలు పరిష్కరించడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో శంకర్ పాల్గొన్నారు.

చివరి ఆయకట్టుకు సాగు నీరు

సంజామల, జనవరి 13(ఆంధ్రజ్యోతి) : ఎస్‌ఆర్‌బీసీ చివరి ఆయకట్టుకు సాగునీరు అందిస్తామని జిల్లా ప్రాజెక్టు కమిటీ వైస్ చైర్మన్ మల్కి హుసేన్ అన్నారు. సోమవారం సంజామల టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఆర్‌బీసీ పరిధిలోని రైతులకు సాగునీటి సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామన్నారు. తనకు గుర్తింపు ఇచ్చిన మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి, ఆయన సతీమణి బీసీ ఇందిరమ్మ, టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు పెండేకంటి కిరణ్ కుమార్‌కు రుణపడి ఉంటానన్నారు.

రామచంద్రాపురంలో మహా యజ్ఞం

దొర్నిపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామచంద్రాపురం గ్రామంలోని రామాలయ ప్రాంగణంలో సంక్రాంతి పండుగ సందర్భంగా సాయి సేవాసమితి ఆధ్వర్యంలో సోమవారం మద్రామాయణ జ్ఞాన మహాయజ్ఞం కార్యక్రమం నిర్వహించారు. కమిటీ సభ్యులు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమం ప్రారంభించారు. శ్రీశైలంకు చెందిన సాయిదాసు, నెల్లూరుకు చెందిన కర్లపూడి కృష్ణలు మద్రామాయణ జ్ఞాన మహాయజ్ఞం చేపట్టారు.

హోరాహోరీగా బండలాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న సినీ నిర్మాత మహేష్ ఖన్నా

డోన్ రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ వేడుకలను పురస్కరించుకుని మండలంలోని కొత్తకోటలో గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు హోరాహోరీగా జరిగాయి. ఈ పోటీలను సినీ నిర్మాత మహేష్ ఖన్నా, డాక్టర్ గురునాథ్ ప్రారంభించారు. తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల నుంచి 19జట్లు రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీల్లో పాల్గొన్నాయి. అనంతపురం, నంద్యాల, ప్రకాశం, నాగర్ కర్నూలు, గద్వాల తదితర ప్రాంతాల నుంచి వచ్చిన ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. మొదటి బహుమతి రూ.35వేలు, రెండో బహుమతి రూ.25వేలు, మూడో బహుమతి రూ.15వేలు, నాలుగో బహుమతి రూ.10వేలు, ఐదవ బహుమతి రూ.8వేలు, ఆరవ బహుమతి రూ. ఐదువేలు నగదు ఇవ్వనున్నట్లు తెలిపారు.

టవర్ నిర్మాణాన్ని అడ్డుకున్న కాలనీవాసులు

బేతంచెర్ల, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని డోన్ రోడ్డు రైల్వేగేటు సమీపంలో వేబ్రిడ్జి పక్కన ఎయిర్‌టెల్ నూతన టవర్ నిర్మాణ పనులను తక్షణమే నిలిపివేయాలని సీపీఐ మండల కార్యదర్శి భార్గవ్‌యన్నా డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని కాలనీవాసులు, సీపీఐ నాయకులను సంప్రదించడంతో వారు అక్కడకు వెళ్లి నిర్మాణ పనులను అడ్డుకున్నారు. ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా టవర్ నిర్మించడం సరైంది కాదన్నారు. రేడియేషన్ ప్రభావం వల్ల ప్రజలు అనేక రకాల చర్మవ్యాధుల బారిన పడుతారని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక మున్సిపల్ అధికారులు ఇష్టమొచ్చినట్లు అనుమతులు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని తెలిపారు. స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు తక్షణమే స్పందించి న్యాయం చేయాలని కోరారు.